పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు

- అందుబాటులో లేని టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ కూలీలు


కేతేపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

కేతేపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులకు వెళ్తున్న కూలీలకు పని చేసే స్థలాల వద్ద కనీస వసతులు కరువయ్యాయి. పని ప్రదేశంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సరైన వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారులు 11వేల జాబ్‌కార్డులు జారీ చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రోజువారీగా 2200 మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. గత ఏడాది నుంచి నూతన విధానం ఎన్ఐసీ (నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్) అమల్లోకి రావడంతో కూలీలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని చేయాల్సి వస్తోంది. పని ప్రదేశం వద్ద కూలీలు పనిచేసే ఫొటోలను అప్‌లోడ్ చేసిన తర్వాతనే కూలీలు ఇంటిబాట పట్టాలి. లేకుంటే హాజరు పడదని ఆదేశాలు జారీ చేయడంతో ఈజీఎస్ సిబ్బంది వచ్చే వరకు పని స్థలాల వద్దనే ఉంటున్నారు.

ఇంటి నుంచే నీళ్ల బాటిళ్లు..

ఉపాధిహామీ పనులు చేపడుతున్న ప్రదేశాల్లో గతంలో గుడారాలతోపాటు, తాగునీరు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైనా వాటి ఊసేలేదు. కూలీలు తమ ఇళ్ల వద్ద నుంచే బాటిళ్లలో నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. అవి పూర్తి కాగానే నీటికోసం అల్లాడుతున్నారు. గతంలో కూలీలు తాగునీరు తెచ్చుకుంటే రోజు రూ.5, వేసవిలో మూడు నెలల పాటు అలవెన్స్‌లు చెల్లించేవారు. కొత్త సాఫ్ట్‌వేర్(ఎన్ఐసీ) వచ్చిన తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. కూలీలు పని ముగించుకుని కాసేపు నీడపట్టున సేద తీరేందుకు పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం అవి అందుబాటులో లేకపోవడంతో ఎండలకు తట్టుకోలేని కూలీలు చెట్ల నీడన సేదతీరుతున్నారు. పని చేసే ప్రాంతంలో తాగునీరు, టెంట్ల ఏర్పాటు విధిగా అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

సొంతంగా గడ్డపార, తట్ట

కూలీలు పనిచేస్తున్న సమయంలో గాయాలపాలు కావడంతోపాటు అస్వస్థతకు గురయ్యే అవకాశముంది. అత్యవసర చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు, ఎండకు నీరసించి, వడదెబ్బ తగిలిన వారికి తాగించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు క్షేత్రస్థాయిలో ఎక్కడా అందుబాటులో ఉంచడం లేదు. అదేవిధంగా ఉపాధి కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు అందడం లేదు. దీంతో కూలీలు వాటిని సొంతంగా ఏర్పాటు చేసుకుని పనులకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి పనిచేసే చోట వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

ఎలాంటి వసతులు లేవు



ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు ఎలాంటి వసతులు ఉండడం లేదు. ఎండలోనే పనులు చేస్తున్నాం. అప్పుడప్పుడు నీడ కోసం చెట్లను ఆశ్రయిస్తున్నాం. పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యంతోపాటు, మెడికల్ కిట్లు, అత్యవసర మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. చేసిన పనికి వెంటనే డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
– నందిసోటి ప్రకాశం, కేతేపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గతంలో టెంట్లు, పారలు ప్రభుత్వం నుంచి వచ్చేవి. ప్రస్తుతం రావడం లేదు. ఎన్ఐసీ అమల్లోకి వచ్చిన తర్వాత తాగునీరు, వేసవి అలవెన్స్ వంటి సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చూస్తాం. మిగతా వసతుల విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం.
– సురేందర్, ఏపీఓ, కేతేపల్లి

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


రామగిరి(నల్లగొండ): జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రామగిరి(నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ మండల కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సీపీఎం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశములో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కొండా అనురాధ మండల కార్యదర్శి నాలుపరాజు సైదులు పాపయ్య, ఎల్లయ్య, కిరణ్, భిక్షం, వెంకటయ్య, రాములు, పద్మ, లక్ష్మమ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మర్రిగూడ సీపీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఊట్కూరి నారాయణరెడ్డి. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, గుండాల నరేష్, కత్తుల యాదయ్య, నల్లబోతు పెద్దులు, బుర్ర లింగయ్య, పిచ్చయ్య, బుచ్చయ్య, శంకర్, ముఖేష్, శివ, శంకర్, గణేశ్, దూదిమెట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మర్రిగూడ : కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, రామలింగాచారి, మల్లయ్య, కొట్టం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గృహ ప్రవేశానికి ప్రముఖులు హాజరు


ఎమ్మెల్యే వీరేశంకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నకిరేకల్ : ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లో ఆదివారం తన నూతన గృహ ప్రవేశం చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజానీకానికి ఎమ్మెల్యే వీరేశం విందు ఏర్పాటు చేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, మందుల సామేల్, కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతి వేడుకలు


బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: బసవేశ్వర జయంతిని నల్లగొండలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సావర్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన బసవేశ్వర భవనాన్ని రిటైర్డ్ ఇంజనీర్ బత్తుల రాజా, మల్లికార్జున ట్రేడర్స్ అధినేత మూల రాజు ప్రారంభించారు. బసవేశ్వర విగ్రహాన్ని డీవీఎం విద్యా సంస్థల అధినేత దొడ్డ శాంతికుమార్ ప్రారంభించారు. బసవేశ్వర చిత్రపటానికి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పటోళ్ల సంగమేశ్వర్, దినేష్ పాటిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లపల్లి రాజప్ప, జెట్టి శివకుమార్, ఇమ్మడి పరమేష్, పొగాకు నాగరాజు, ధర్మిశెట్టి కోటి, ఉప్పు శేఖర్, కర్నే వరప్రసాద్, మామిడి ఈశ్వరయ్య, పత్తి వినయ్, వెంబడి లింగప్ప, కర్నే ఆనంద్ కుమార్, మామిడి శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మేడే వారోత్సవాలు


నల్లగొండ టౌన్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



నకిరేకల్ : జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

నల్లగొండ టౌన్: పేదలకు అండ ఎర్రజెండా అని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. ఆదివారం మేడే వారోత్సవాల్లో భాగంగా మర్రిగూడ సీపీఎం కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కడారి నరసింహ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, గుండాల నరేష్, గౌరీదేవి, మధుసూదన్, కత్తుల యాదయ్య, నల్లబోతు పెద్దులు, బుర్ర లింగయ్య, కుమ్మరబోయిన పిచ్చయ్య, బొడ్డు బుచ్చయ్య, దుబ్బాక శంకర్, బొజ్జ ముఖేష్, బొజ్జ శివ, నల్లబోతు శంకర్, బొడ్డు గణేశ్, దూదిమెట్ల వెంకన్న పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

నకిరేకల్ : ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 327 యూనియన్ బలోపేతానికి ప్రతి ఉద్యోగి, కార్మికులు కృషి చేయాలని సంఘం డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమ్మిరెడ్డి కోరారు. నకిరేకల్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 327 యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మేడే వారోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సబ్ డివిజన్ అధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, కంపెనీ జాయింట్ సెక్రటరీ అబ్బాస్, సెక్రటరీ సమ్మెట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: బహుజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మేడే వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గద్దపాటి సురేందర్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సైదులు, మధుబాషిణి, లక్ష్మయ్య, శెవరి ఆరోగ్యం, విజయ్‌కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే ఆర్టీసీ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మిర్యాలగూడ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాండు రంగయ్య, నర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాము, ఎండీ బేగ్, బీవై కోటయ్య, వెంకన్న, రాయన్న, మధు, వెంకన్న, బాలునాయక్, అంజయ్య తదితరులున్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం


కట్టంగూర్ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- 22 పంచాయతీల్లో 2.65 లక్షలు నాటడమే లక్ష్యం
- గత సంవత్సరం కంటే 1.44లక్షలు అదనంగా పెంపకం
- రక్షణకు గ్రీన్‌షెడ్లు ఏర్పాటు

కట్టంగూర్ : పల్లెల్లో పచ్చదనమే లక్ష్యంగా ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలో గత సంవత్సరం 1.21లక్షల మొక్కలు పెంచగా ఈ సంవత్సరం 2.65లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో మండల వ్యాప్తంగా ఉన్న నర్సరీల్లో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అదనంగా 1.44లక్షల మొక్కలు పెంచుతున్నారు. గత ఏడాది ప్రతి జీపీలో సుమారుగా 10వేల మొక్కలు పెంచగా ప్రస్తుతం ఆయా గ్రామాల జనాభా ప్రాతిపదికన మొక్కలను పెంచుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీ కట్టంగూర్‌లో 40వేల మొక్కలు, అయిటిపాములలో 30,500, బొల్లేపల్లిలో 15వేలు, భాస్కర్లబాయిలో 4వేలు, కల్మెరలో 11వేలు, పరడలో 15వేలు, మునుకుంట్లలో 14,500, ఈదులూరులో 19వేలు, చెర్వుఅన్నారంలో 14వేలు, దుగినవెల్లిలో 14వేలు, గార్లబాయిగూడెంలో 7వేలు, ఇస్మాయిల్‌పల్లిలో 7వేలు, కురుమర్తిలో 13వేలు, మల్లారంలో 3500, ముత్యాలమ్మగూడెంలో 13,500, నల్లగుంటబోలులో 3వేలు, నారెగూడెంలో 8వేలు, పామనగుండ్లలో 7వేలు, పందెనపల్లిలో 6వేలు, పిట్టంపల్లిలో 6500, రామచంద్రాపురంలో 5500, ఎరసానిగూడెంలో 8వేల చొప్పున మొక్కలు పెంచుతున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది వేగవంతం చేశారు. పల్లెల్లో పచ్చదనం మరింత పెంచేందుకు గాను నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా చేయిస్తున్నారు. మండలంలో జూన్ మొదటి వారం నాటికి 2.65లక్షల మొక్కలను నాటేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నర్సరీల్లో పలు రకాల మొక్కల పెంపకం..

మండలంలోని మొత్తం 22గ్రామపంచాయతీలకు గాను 22జీపీల్లో అధికారులు నర్సరీలను ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల్లో అల్లనేరేడు, గుల్‌మోహర్, జామ, చింత, సీతాఫలం, రాగి, తులసి, ఫెల్టోఫారమ్, గులాబీ, ఈత, ఖర్జూరతో పాటు పలు రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. గత వారం రోజులుగా మండలంలో ఎండ తీవ్రత పెరగడంతో మొక్కలు వాడుపడుతున్నాయి. దీంతో మొక్కలను కాపాడేందుకు నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అధికారులు మొక్కలు రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నా అధిక ఉష్ణోగ్రతతో 15 నుంచి 20శాతం మొక్కలు చనిపోయే పరిస్థితి నెలకొంది.

మొక్కల ప్లాంటేషన్‌కు ప్రణాళిక సిద్ధం

మండలంలోని 22 గ్రామాల్లో పెంచుతున్న మొక్కలను జూన్ మాసంలో వర్షాలు కురవగానే నాటాలని అధికారులు తెలిపారు. ఎవెన్యూ ప్లాంటేషన్ (రోడ్డుకు ఇరువైపులా) 53వేల మొక్కలు, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో 53వేలు, రైతుల గెట్ల వెంట 53వేలు, గృహ అవసరాలకు 39,750 మొక్కల పంపిణీ, ట్యాంక్‌బండ్ రకం 26500, బయోఫెన్సింగ్ వెంట 26500 చొప్పున మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

వందశాతం మొక్కల రక్షణకు చర్యలు



ఉపాధిహామీ పథకంలో మండలంలోని 22గ్రామ పంచాయతీల్లో గల నర్సరీల్లో గల మొక్కలను వందశాతం రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గతంలో మాదిరిగా కాకుండా జీపీ జనాభా ప్రాతిపదికన మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఎండిన మొక్కల స్థానంలో త్వరితగతిన పెరిగే మొక్కలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఎండ తీవ్రత పెరగడంతో మొక్కలను రక్షించేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. జూన్ మొదటి వారంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం.
– కడెం రాంమోహన్, ఏపీఓ కట్టంగూర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నల్లగొండ టౌన్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


గట్టుప్పల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నల్లగొండ టౌన్: పట్టణంలోని మమత హైస్కూల్‌లో 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ఐఎంఏ భవనంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి, సలీం, భీష్మారెడ్డి, మల్లేశం, సత్యనారాయణ, మల్లారెడ్డి, జయప్రకాష్, పురుషోత్తం, విజయలక్ష్మి, వెంకట్రాంరెడ్డి, రామారావు, నిరంజన్‌రెడ్డి, మధు, చందు, సందీప్, నాగరాజు, నగేష్, మహేష్, విజయేందర్‌రెడ్డి, తేజస్విని, దీపిక, మాధవి, లీలావతి పాల్గొన్నారు.

క్లాక్‌టవర్ (నల్లగొండ): పట్టణంలోని గీతా విజ్ఞాన హైస్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల పిల్లల నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సుధాకర్, పురుషోత్తమాచార్యులు, ఆంజనేయులు, వేణు రఘునీ్స, విజిత, యామిని, రాజమణి, శ్వేత, సౌజన్య, శరత్ నరేందర్, వంశీ, శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.



కట్టంగూర్ : సమ్మేళనంలో పాల్గొన్న ఈదులూరు జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు


నకిరేకల్ : మండలంలోని చందుపట్ల జెడ్పీ హైస్కూల్‌లో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

గట్టుప్పల్ : మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్‌లో 2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

నాలుగు దశాబ్దాల తర్వాత..

కట్టంగూర్: మండలంలోని ఈదులూరు జెడ్పీహెచ్ఎస్‌లో 1985–86లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి, నాలుగు దశాబ్దాల తర్వాత తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు.. సరైన వసతులు లేకపోయినా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన వారిని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోదల వెంకట్‌రెడ్డి, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ కరీం, అనుముల వెంకటయ్య, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మ, కలమ్మ, జ్ఞానేశ్వరి, పార్వతమ్మ పాల్గొన్నారు.


క్లాక్‌టవర్ (నల్లగొండ): సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


నకిరేకల్ : చందుపట్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఘనంగా భగీరథ మహర్షి జయంతి


భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

నల్లగొండ: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ సమావేశ మందిరంలో మహర్షి భగీరథ చిత్ర పటానికి స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్‌ను జిల్లా సగర సంఘం ప్రతినిధులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, నెర్లకంటి రవికుమార్, సహాయ బీసీ సంక్షేమ అధికారి గామప్ప, ఎస్తేర, మారయ్య, గంట కృష్ణ, నెర్లకంటి వసంత, బలుగూరి కర్ణాకర్, పెద్ద జంగయ్య, ప్రవీణ్, సుధాకర్, వెంకటేష్, గొల్లూరి యాదయ్య, గంట యాదయ్య, మర్రి శశిధర్, శ్రవణ్, సురేందర్‌లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

నల్లగొండ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సభ్యుడు బండారి రమేష్ అన్నారు. నల్లగొండ పరిధిలోని చర్లపల్లిలో ×అమేజింగ్ లైట్ ఆఫ్ గ్రేస్ మినిస్ట్రీస్× చర్చిలో ఆదివారం బాల్యవివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎలీషా నాలో, రేచల్ నాలో పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న బండారి రమేష్

క్లుప్తంగా

నేడు కల్లు గీత సంఘం ఎన్నికలు

నకిరేకల్ : కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం జరుగనున్నాయి. నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డులో కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం భవనంలో రహస్య బాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించనున్నారు. సంఘంలో మొత్తం 782 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం తొమ్మిది డైరెక్టర్ల పదవులకు ఎన్నిక జరుగనుంది. ఇప్పటికే ఎస్సీ కోటా నుంచి ఒక డైరెక్టర్ పదవి ఏకగ్రీవం అయింది. మిగతా ఎనిమిది డైరెక్టర్ల పదవుల కోసం 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రెండు ప్యానెళ్ల వారు ఈ పదవుల కోసం పోటీ పడుతున్నారు. జిల్లా సహకార అధికారి, జిల్లా ఎన్నికల అధికారి డి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ ముగిసిన తరువాత ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని ఎన్నికల అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, ప్రభుత్వం ఉచితంగా దరఖాస్తులు స్వీకరిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను ఈ నెల 26న వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించారు.

తిప్పర్తి : మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ఈ నెల 5 నుంచి ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ అపర్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్యాణ మండపం పనులు పూర్తిచేస్తాం

నకిరేకల్ : కల్లుగీత సంఘానికి సంబంధించిన కల్యాణ మండపం పనులను తాము గెలిచిన ఆరు మాసాల్లో పూర్తి చేస్తామని గౌడ సంఘం నాయకులు చౌగోని శ్రీనివాస్‌గౌడ్, కొండ వెంకన్న, చౌగోని నాగయ్యగౌడ్‌లు అన్నారు. ఆదివారం నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సహకారం సంఘం ఎన్నికల్లో తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పోటీలో ఉన్న అభ్యర్థులు కొండ శ్రీను, చౌగోని వెంకన్న, తండు వెంకటేశ్వర్లు, మల్లేబోయిన దశరథ, కొండ యాదమ్మ, వీరమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

చిట్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాలలో ఆదివారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశగాని బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె బాలరాజుగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, జిల్లా సత్యం, జహంగీర్, బొల్లూరు లింగయ్య, గుండాల సత్తయ్య పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో ప్రసవం చేసిన సిబ్బంది

చండూరు: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన ఇరిగి మహేంద్రకు శనివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆమెను అంబులెన్స్‌లో నల్లగొండకు తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటి సత్యనారాయణ, పైలట్ శంకర్ సహాయంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చారు. తదుపరి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డీసీఎంను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

చిట్యాల: హైవే పక్కన ఆగి ఉన్న డీసీఎంను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఆ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వెలిమినేడు శివారులోకి రాగానే పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే దారి వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. డీసీఎంను ఢీకొట్టి నిలిచిపోయిన ట్రావెల్స్ బస్సును ఆ వెనుకే వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో హైవేపై పైనుంచి ప్రమాదానికి గురైన వాహనాలను హైవే సిబ్బంది తొలగించి ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకున్నారు.